'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# భారతరత్న అద్వానీ

కేంద్రం ఈ ఏడాది ఇద్దరు రాజకీయ ఉద్దండులకు సర్వోన్నత పౌరపురస్కారమైన భారతరత్న ప్రకటించింది. అందులో మొదటి వ్యక్తి బీహారీ సామాజికన్యాయ పథనిర్దేశకుడు కర్పూరీ ఠాకూర్ కాగా, రెండో వ్యక్తి హిందూత్వ రాజకీయాలను మలుపు తిప్పిన బీజేపీ దిగ్గజం లాల్‌కృష్ణ అద్వానీ. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ ప్రకటనలు వెలువడ్డాయన్నది తెలిసిన విషయమే. ఈ ఎంపికలు ప్రస్తుత దేశ నాయకత్వ ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయని చెప్పకతప్పదు. మందిర్, మండల్ అనే రెండు విభిన్న ధోరణులను సమతూకం చేయాలనే ఆలోచన వీటి వెనుక ఉందనేది వాస్తవం. మరణానంతరం చాలాకాలం తర్వాత ఒకరిని ఎంపిక చేస్తే, మరొకరిని రాజకీయ జీవిత చరమాంకంలో ఎంపిక చేశారు. రాజకీయ సిద్ధాంతాల పరంగా ఇద్దరూ ఉత్తర, దక్షిణ ధ్రువాలు కావడం విశేషం. రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేసి మండల్ రాజకీయాలకు బాటలు వేసిన వ్యక్తి కర్పూరీ ఠాకూర్. అట్టడుగువర్గాల నుంచి వచ్చిన నేత. భారతీయ సోషలిస్టు ఆలోచనా ధోరణికి ప్రతినిధి. అలాగే అయోధ్య రామమందిర డిమాండ్ ప్రబలంగా ముందుకు రావడంలో అద్వానీ నిర్వహించిన రథయాత్ర కీలక పాత్ర పోషించింది. ప్రధాని నరేంద్ర మోదీకంటే ముందరి కాలంలో హిందూత్వ రాజకీయాలకు ప్రతీకలా నిలిచిన నేత. ఆయన ప్రబలంగా ముందుకుతెచ్చిన అయోధ్య రామాలయ డిమాండ్ బీజేపీ రాజకీయ ఉత్థానానికి పునాదులు వేసింది. దీని పర్యవసానంగానే ఈరోజు ఆ పార్టీ జాతీయ రాజకీయాల్లో నిర్ణాయక పాత్ర పోషించే స్థితికి ఎదిగిందనేది నిర్వివాదాంశం. ఈ కోణంలో పరిశీలిస్తే అద్వానీ ఎంపిక పెద్దగా ఆశ్చర్యం కలిగించదు.

బీజేపీ అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు అందించిన అద్వానీకి సర్వోన్నత పదవులు ఎప్పుడూ దూరంగానే ఉండిపోయాయి. అటల్ బిహారీ వాజపేయి హయాంలో ఆయన ఉపప్రధానిగా సేవలందించారు. ఒక దశలో ప్రధాని అవుతారని అనుకున్నప్పటికీ ఆ పదవి ఆయనకు రకరకాల కారణాల వల్ల దక్కలేదనేది తెలిసిందే. మరోదశలో ఆయన పేరు రాష్ట్రపతి పదవికి బలంగా వినిపించినప్పటికీ అదీ జరగలేదు. విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన ఇటీవల అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యల కారణంగా హాజరు కాకపోవడం(కావొద్దనడం)పై కూడా చర్చోపచర్చలు జరిగాయి. నూరో పుట్టినరోజుకు దగ్గరగా ఉన్న అద్వానీకి ప్రస్తుతం అవన్నీ అప్రస్తుత విషయాలే కావచ్చు. అయితే ఏనాడూ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి సంకుచిత రాజకీయాల జోలికి ఆయన వెళ్లకపోవడం గమనార్హం. తన జీవితాన్ని బీజేపీ సిద్ధాంతాల సాధనకు, శ్రేయస్సుకు అంకితం చేసిన నేతకు ఆలస్యంగానైనా తగిన గుర్తింపు ఇవ్వాలనే కేంద్ర పెద్దల ఆలోచనే..బహుశా ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేయడానికి దోహదం చేసి ఉండవచ్చు. ఎన్నికల వేళ అద్వానీ అనుయాయుల్ని, అభిమానుల్ని తనవైపు తిప్పుకోవాలనే మోదీ రాజకీయమూ ఇందులో దాగి ఉండవచ్చు.

ఇవన్నీ ఎలా ఉన్నా భారతరత్న అవార్డు రాజకీయ ప్రాధాన్యతలకు పరిమితం కావడమే కొంత విచారకరం. రాజకీయ నేతలకు ఈ అవార్డు ఇవ్వడం కొత్తకాదు. ప్రథమ ప్రధాని నెహ్రూ మొదలుకొని ఇందిరా, ఎంజీఆర్ వరకు ఎందరో రాజకీయ మహామహులు ఈ అవార్డు అందుకున్నవారిలో ఉన్నారు. కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఎంఎస్ సుబ్బలక్ష్మి, లతామంగేష్కర్ తదితర ప్రముఖులు గతంలో ఎంపికయ్యారు. ఇటీవలి కాలంలో సామాజిక, కళా, సాంస్కృతిక రంగాలకు ప్రాధాన్యం తగ్గిపోవడం ఆలోచించదగిన అంశం.

# గజిబిజిగా గద్దర్ వారసత్వం



టంకశాల అశోక్

గద్దర్ అనే ఒక మహత్తర విప్లవ సాంస్కృతిక శక్తి వారసత్వం గజిబిజిగా మారుతున్నది. ఆయన తన ఆటపాటలతో అణగారిన ప్రజలతో పాటు సాధారణ సమాజంపై సైతం కొన్ని దశాబ్దాల పాటు వేసిన అనితరమైన ముద్ర వారసత్వం ఎవరిది అంటే వెంటనే జవాబు చెప్పుకోలేని పరిస్థితి మనకు ఇప్పుడు ఎదురవుతున్నది. గద్దర్ తన చివరి దశలో కొన్ని తడబాట్లు పడినా, ఆ వారసత్వం ఆయన అచంచలమైన పీడిత ప్రజల పక్షపాతాన్ని, గుండెలలో నిలుపుకొన్న సమాజానిదా? లేక, తన పేరు ప్రతిష్టలను రకరకాలుగా ఉపయోగించుకుని లాభపడజూస్తున్న శక్తులదా అనే ప్రశ్న ముందుకు వస్తున్నది.

నిరుడు ఆగస్టులో గద్దర్ మరణించినప్పటి నుంచి గత ఆరు నెలలుగా జరుగుతున్నదేమిటో చూస్తూనే ఉన్నాం. ఒకవైపు గ్రామాల్లో, పట్టణాల్లో జనసామాన్యం ఇప్పటికీ ఆయన పాటలు వింటున్నారు. వీడియోలు చూస్తున్నారు. వాటిలో లీనమవుతున్నారు. ఆయన గురించి మాట్లాడుకుంటున్నారు. వారి బాధలు, గాథలతో సంబంధం గల సాంస్కృతిక ప్రపంచంలో గద్దర్‌కు తప్ప మరొకరికి స్థానం లేదు. తను జీవించి ఉండగాలేదు, తన మరణం తర్వాత నేటికీ లేదు. కొద్దిమంది ఆ కాలంలో ఉండినవారు క్రమంగా చెల్లాచెదురయ్యారు, లేదా లోకం నుంచి నిష్క్రమించారు. ఇంకా ఒకరిద్దరు మిగిలి ఉన్నా వారిది గానీ, వీరిది గానీ గద్దర్ అంతటి స్థాయి కాదు. ముద్ర అంటూ, వారసత్వం అంటూ మిగల్చగల స్థాయికి చేరినది గద్దర్ మాత్రమే. జన సామాన్యపు ఇండ్ల నుంచి తన గేయాలు, ఆవేశపు వ్యాఖ్యానాలు, ప్రశ్నలు నేటికీ వినవస్తుండటమే అందుకు తిరుగులేని రుజువు. అందువల్లనే గద్దర్ అనే విప్లవ సాంస్కృతిక శక్తి గుర్తింపు తెలుగు సీమలకు పరిమితం కాక, జాతీయం, అంతర్జాతీయం అయింది.

ఒకవైపు కనిపిస్తున్న పరిస్థితి ఇది కాగా, మరొకవైపు గద్దర్ మరణించిన తొలి రోజుల నుంచే ఇందుకు భిన్నమైన, ఇంకా చెప్పాలంటే విరుద్ధమైన పరిస్థితులను మనం చూస్తున్నాం. తనకు గల అపారమైన జనాదరణను పలు విధాలుగా ఉపయోగించుకుని లాభపడజూస్తున్నవారు అనేకులు. ఆయన విప్లవకారుడు అయినందున, దళితుడు అయినందున, లేదా తమ కుటుంబ సభ్యుడు కావడం వల్ల వేర్వేరు వారు, వేర్వేరు రూపాల్లో గద్దర్ ప్రజాదరణను ఒక మారకపు సరుకుగా మార్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అట్లా ఎవరేమి చేశారు, ఇప్పటికీ ఏమి చేస్తున్నారనేది అందరూ చూస్తున్నదే అయినందున, ఆశ్చర్యంతో, బాధతో ముక్కున వేలు వేసుకుంటున్నదే అయినందున, ఇక్కడ ఏకరువు పెట్టాల్సిన అవసరం లేదు. వారి ఈ ప్రయత్నాలు గత ఆరు మాసాలుగా సాగుతున్నవే అయినందున, ఇక ముందు కూడా కొనసాగగలవని చెప్పుకోవచ్చు. గద్దర్ ప్రతిష్ఠకు మారకపు విలువ ఇంకా ఉందని వారు భావించినంత కాలం ఆ పని చేస్తూనే ఉంటారు.

ఇందులో మరొక సూక్ష్మమైన రహస్యం ఉంది. ఒక వస్తువుకు యథాతథంగా మారకపు విలువ ఉండటం వేరు, అది ఎవరికైనా మారకపు విలువగా ఉపయోగపడటం వేరు. ఈ సూత్రాన్ని అర్థమయ్యేట్టు చెప్పాలంటే, గద్దర్‌కు ప్రజాదరణ ఉండటం వాస్తవం. అది తన ఆశయాల కోసం అయితే మారకం కావటం సహజం, వాంఛనీయం. అందుకు



భిన్నంగా ఆ ప్రజాదరణ విలువ ఓట్లు అనుకుందాం. ఏవైనా పార్టీలు గానీ, లేదా ఆయన సన్నిహితులు గానీ ఆ ప్రజాదరణను తాము గౌరవిస్తున్నామని చెప్పుకొంటూ, ప్రజలంతా తమకు ఓట్లు వేయాలని కోరితే అది జరగకపోవచ్చు. వారితో ఆ ప్రజలు, 'గద్దర్ అంటే మాకు ప్రేమ ఉన్న మాట నిజం. మీకు కూడా ప్రేమ ఉన్నదని మీరు చెప్తే సంతోషిస్తాం. కానీ, ఆయనపై మాకున్న ప్రేమతో మీకు ఓట్లు వేయాలంటే ఒప్పుకోము' అని అనవచ్చు. అప్పుడు ప్రజాదరణకు ఓట్ల రూపంలో మారకపు విలువ లభించదు.

> ఈ పరిస్థితి ఎందువల్ల? ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. గద్దర్ పట్ల ప్రజల ప్రేమకు ఒక సందర్భం ఉంది. అది విప్లవోద్యమాల సందర్భం. విప్లవ సాంస్కృతిక సందర్భం. ప్రజల ప్రేమకు ఆ పరిధిలో మాత్రమే సందర్భం, సంబంధం ఉంటాయి. గద్దర్ ఆశయాల కోసం మారకపు విలువ ఉంటుంది. ఆ పరిధిని దాటితే ప్రజల ప్రేమకు ఎన్నికల మారకపు విలువ ఉండదు. తమ ప్రేమకు ఆ పద్ధతిలో విలువ కట్టడం ప్రజలకు మనస్కరించదు. ఇది ఇప్పటికే రుజువైంది కూడా.

తను జీవించి ఉన్నప్పుడు పెట్టిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ పార్టీ ఎన్నికల్లో పోటీ అయితే చేయలేదు గానీ, అసలు ఆ పార్టీ ఏర్పాటు పట్లనే ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడలేదు. ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన కుమార్తె పరిస్థితి ఏమైందో చూశాం. కనుక, గద్దర్ పట్ల ప్రజల అవగాహన, దృక్కోణం ఏమిటో వారాయనను ఏ పరిధికి లోబడి చూస్తారో అర్థం చేసుకోవచ్చు. ఆ పరిధిని దాటితే తనను మారకపు వస్తువుగా చూసేందుకు, మార్చేందుకు వారు ఇష్టపడరు. గద్దర్ విషయంలోనే కాదు, అటువంటి ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల ఏ వ్యక్తి విషయంలోనైనా ఆ పరిధిని దాటితే ఇదే జరుగుతుంది. ఉదాహరణకు గాంధీజీ, అంబేద్కర్ వంటి వారు స్టాక్ ఎక్స్చేంజ్ వ్యాపారులుగా మారితే వారి షేర్లను ప్రజలు విరగబడి కొంటారనే హామీ ఏదైనా ఉంటుందా?

దీనికి సంబంధించే అర్థం చేసుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. గద్దర్ ఆలోచనా ధోరణితో గతంలో ఎన్నడూ సంబంధం లేనివారు, లేదా ఆ ధోరణిని తీవ్రంగా వ్యతిరేకించినవారు, విప్లవోద్యమాలను, దళితులను అణచివేసిన, హతమార్చినవారు ఇప్పుడు అకస్మాత్తుగా ఆయన ఆశయాల కోసం తాము పాటు పడగలమని చెప్తే ప్రజలు నమ్మగలరా? తమను తాము మారకపు వస్తువుగా మార్చుకునేందుకు సిద్ధపడతారా? గద్దర్‌ను వ్యక్తిగా గౌరవించినట్టు, లేదా తన ఆలోచనలను మన్నిస్తున్నట్టు ఏవైనా కొన్ని చర్యలు తీసుకున్నట్టయితే అంత మేరకు ప్రజలు తప్పక హర్షిస్తారు. కానీ, అందువల్ల వారి దృష్టి మౌలికంగా ఏమీ మారదు. మారటం లేదు కూడా అని ఈ ఆరు నెలల కాలంలో నేలకు చెవి ఒగ్గి విన్నవారికి అర్థమవుతున్న విషయమే.

ఈ విధమైన పరిస్థితులన్నింటినీ గమనించినప్పుడు, గద్దర్ వారసత్వం ఎవరిది అవుతుందో ఎవరికి వారు గ్రహించవచ్చు. అది ఆయన అనేక దశాబ్దాల పాటు తనను తాను కరిగించుకొని అంకితమై పాటుబడిన పీడిత సమాజానిది మాత్రమే. విద్య వలెనే అది తడవనిది, కాలనిది, క్షీణించనిది. గద్దర్ తన జీవితకాలంలోనే చివరి దశలో కొన్ని తడబాట్లకు గురైన మాట నిజం. అయితే ఆయన విప్లవ సాంస్కృతిక మార్గావరోహణలో ఏ విధంగానైతే తన సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నుంచి రూపుదిద్దుకొని 'చైల్డ్ ఆఫ్ హిజ్ టైమ్స్' అయ్యారో, ఆ తడబాట్ల కాలంలో కూడా అదే పరిస్థితుల నుంచి 'చైల్డ్ ఆఫ్ హిజ్ టైమ్స్' అయ్యారు. ఈ రెండు దశల్లో విప్లవ రాజకీయాల పరిస్థితులు కూడా మొదట ఉత్తేజకరంగా, చివరి దశలో నిరుత్సాహకరంగా మారటం తెలిసిందే. ఆ ప్రభావాలు ఆయనపై సహజంగానే ఉన్నందున తనను నిందించలేం. అంతిమ విశ్లేషణలో గద్దర్ వారసత్వం ఆయన ప్రేమించిన, తనను ప్రేమించిన పీడిత సమాజానిది మాత్రమే తప్ప, ఆయనను మార్పిడి విలువగా చూసేవారిది కాబోదు.

ఇదే సందర్భంలో చెప్పుకోవాల్సిన విషయం ఒకటున్నది. అధికారం కోసం గద్దర్‌కు వలెనే ఇంద్రవెల్లిని కూడా మారకపు విలువగా ఉపయోగించుకునే ప్రయత్నాలను మనం చూస్తున్నాం. అధికారాన్ని, సంపదలను కోరుకునే వారు, వాటిని తమచేత చిక్కించుకొని ప్రజలను పీడించే వారు ఎక్కడైనా, ఎప్పుడైనా అనుసరించే పద్ధతులే ఇవి. పీడించేది వారే, పీడితుల ఉద్యమాలను, గద్దర్ వంటి పీడితుల స్వరాలను అణచివేసేది వారే. తిరిగి అవసరాన్ని బట్టి పీడితులను మభ్యపెడుతూ గద్దర్ వంటివారి వారసత్వాన్ని, ఇంద్రవెల్లి వంటి స్మృతులను మారకపు విలువగా వాడుకొనజూసేదీ వారే. అయితే సమాజంలో గానీ, చరిత్రలో గానీ ఇటువంటి స్మృతులు, వారసత్వాలు నేల కింది పొరల్లోకి చేరి శాశ్వతంగా నిక్షిప్తమై ఉంటాయి. నేలకు పైపైన ఎవరైనా తమ విన్యాసాల ద్వారా ఆ వారసత్వాలను అధికార ప్రయోజనాల కోసం ఉపయోగించుకొనజూస్తే, అవి తాత్కాలిక విన్యాసాలుగా మాత్రమే మిగులుతాయి.

# కృష్ణా జలాల హక్కులపై ఎడతెగని కుట్రలు



వి.ప్రకాశ్
90009 50400

మలిదశ తెలంగాణ ఉద్యమానికి మూలాలు నీళ్లలోనే ఉన్నాయి. తలాపున గోదావరి పారుతున్నా మడి తడవని తండ్లాట, పక్కన కృష్ణమ్మ పరుగులు తీస్తున్నా పంటపొలాలు నెర్రెలు బారి బీళ్లుగా మారుతున్న దయనీయ పరిస్థితులను చూసి 'మా నీళ్లు మాకేనని' మర్లబడిన జనం ఉద్యమ రాగాన్ని ఎత్తుకొని తెలంగాణ రాష్ట్రం కోసం పోరుబాట పట్టారు.

'గోదావరి, కృష్ణమ్మలు మన బీళ్లను తడపాలి- పచ్చని మాగాణంలో పసిడి సిరులు పండాలి, సుఖసంతోషాలతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి' అని ఆకాంక్షించారు. అందుకు రాష్ట్ర ఏర్పాటే పరిష్కారమనుకున్నారు. ప్రజల ఆకాంక్ష ఫలించి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నాం. కేసీఆర్ దార్శనిక నాయకత్వంలో జలకళ సాధించుకున్నాం. నీటి హక్కుల కోసం నిరంతరం జాగరూకతతో పోరాడుతున్నాం. కానీ ఇప్పుడు ప్రభుత్వం మార్పుతో అంతా తారుమారు అవుతున్నది.

గడిచిన తొమ్మిదిన్నరేండ్లు సస్యశ్యామల తెలంగాణ కోసం ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో భగీరథ ప్రయత్నం జరిగింది. తెలంగాణలోని సాగునీటి రంగంతో పాటు సకల రంగాలపై పట్టున్న కేసీఆర్.. జల జగడాలను తనదైన పద్ధతిలో పరిష్కరించారు. లక్షలాది ఎకరాలకు అదనంగా సాగునీటి వసతిని పెంచి పల్లెపల్లెనా ధాన్యరాశులను సృష్టించారు. 'కోటి ఎకరాల మాగాణం నా స్వప్నం' అని ప్రకటించి సాగునీటి ప్రాజెక్టుల రీ-డిజైనింగ్ చేసి, పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి లక్ష్యసాధన దిశగా ముందుకుసాగారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ పాలకుల ఎడతెగని కుట్రలను ఛేదిస్తూ, మరోపక్కన రాష్ట్రాల హక్కులను తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే దుర్బుద్ధితో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ కుట్రలను ఎదుర్కొంటూ రాజీలేని పోరాటం చేశారు కేసీఆర్.

> అబద్ధాలు, అసత్యాలను సోషల్‌మీడియాలో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులకు ఈ ప్రాంత అవసరాల పట్ల అవగాహన గానీ, ప్రజల పట్ల ప్రేమ గానీ ఉన్నట్టు కనిపించటం లేదు. మరోసారి కృష్ణా జలాల పరిరక్షణకు కేసీఆర్ నాయకత్వంలోనే ఉద్యమానికి సన్నద్ధం కావాలి.

ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న మాట కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 9వ విభాగంలో ఇరు రాష్ట్రాల మధ్య జలవనరుల నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలను పొందుపరిచారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246, ఏడో షెడ్యూల్‌లోని రెండో (రాష్ట్రాల) జాబితాలో ఉన్న 17వ అంశం ప్రకారం నదీ జలాలపై పూర్తి హక్కులు రాష్ట్రాలకే ఉంటాయి. కానీ, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అంతర్రాష్ట్ర నదుల నిర్వహణకు సంబంధించి పార్లమెంట్‌లో చట్టం చేసే అధికారం, తద్వారా రాష్ట్రాల హక్కులను నియంత్రించే అవకాశం కేంద్రానికి ఉన్నట్టు.. మొదటి (కేంద్రం) జాబితాలోని 56వ అంశంగా ఏడో షెడ్యూల్‌లో ప్రస్తావించారు రాజ్యాంగ నిర్మాతలు. దీన్ని ఆధారంగా చేసుకొని 1956లో 'ది ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ డిస్ప్యూట్ యాక్ట్'ను రూపొందించారు. కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి పరీవాహక రాష్ట్రాల అభ్యర్థనపై 1969లో అప్పటి కేంద్ర ప్రభుత్వం 'బచావత్ ట్రిబ్యునల్'ను ఏర్పాటు చేసింది. 1973లో ఈ ట్రిబ్యునల్ నివేదిక ఇచ్చింది. ఒకపక్కన కృష్ణా పరీవాహక రాష్ట్రాల జలవివాదాలు కొనసాగుతుండటం, మరోపక్కన కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని కేసీఆర్ జలసాధన ఉద్యమాన్ని నిర్వహించడం, రాయలసీమలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తూ కృష్ణా నదినే మళ్లించే ప్రయత్నాలు చేయడం, తదితర ఒత్తిళ్ల ఫలితంగా 2004లో వాజపేయి ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.

ఈ ట్రిబ్యునల్ 2010 డిసెంబర్ 30న తన తీర్పు కాపీని ప్రభుత్వానికి అందజేయగా, ఉమ్మడి ఏపీ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. తదనంతరం కృష్ణా జలాల పునఃపంపిణీపై తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టడంతో ట్రిబ్యునల్ కాలపరిమితిని కేంద్రం పలుమార్లు పొడిగించింది. అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం సెక్షన్-3 కింద ఉమ్మడి ఏపీకి కేటాయించిన కృష్ణా జలాలను పరీవాహక ప్రాంత నిష్పత్తి (68:32) ప్రకారం పునఃపంపిణీ చేయడానికి కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని కేసీఆర్ 2014 నుంచి డిమాండ్ చేస్తూ వచ్చారు. సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించడంతో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జలశక్తి శాఖ మంత్రి షెకావత్‌ను కేసీఆర్ నిలదీశారు. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ఉపసంహరించుకుంటే, ఈ విషయమై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని షెకావత్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కానీ, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి మోదీ ప్రభుత్వానికి లేదు. అందుకే కాలయాపన చేసిచేసి గత ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అక్టోబర్ 6న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ కోసం తెలంగాణ చేసుకున్న అభ్యర్థనను నివేదించింది.

ఈ ట్రిబ్యునల్ తీర్పు కోసం ఇంకా ఎన్నేండ్లు వేచిచూడాలో తెలియదు. ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా



కృష్ణా జలాల దోపిడీకి ఆంధ్రా పాలకులు దొడ్డిదారులు వెదుకుతూ కుట్రలను కొనసాగిస్తూనే ఉంటారు. కాంగ్రెస్, బీజేపీ తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆంధ్రా కుట్రలకు మద్దతిస్తూనే ఉంటాయి. స్వరాష్ట్రం కోసం రాజీలేని పోరాటం చేసిన బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం గట్టిగా నిలబడతారు.

> కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ద్వారా తెలంగాణ నీటి హక్కులను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని గత పదేండ్లుగా విఫల యత్నం చేస్తూ వస్తున్నది. రాష్ట్రాల నీటి హక్కులను తమ ఆధీనంలో పెట్టుకుంటే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను శాసించవచ్చని మోదీ-షా ద్వయం భావిస్తున్నది.

ఏపీ పునర్విభజన చట్టాన్ని 2014లో రూపొందించి, ఆమోదించింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే (యూపీఏ-2). ఈ చట్టంలో నదీ జలాల నిర్వహణకు సంబంధించి రాష్ట్రాల హక్కులను లాక్కునేలా కేంద్ర ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టింది కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. ఈ చట్టంలో పేర్కొన్న కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలను పూర్తిగా కేంద్ర జలసంఘం అధికారులతో నింపారు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధుల సంఖ్య, వారి పాత్రను నామమాత్రం చేశారు.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా 2021 జూలై 15న రెండు తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రాంత ప్రాజెక్టులన్నింటినీ బోర్డుల నియంత్రణ కిందికి తెస్తూ రెండు వేర్వేరు గెజిట్‌లను జారీ చేసింది. ఈ విధంగా గెజిట్ జారీ చేయడానికి అవకాశం ఇచ్చింది ఏపీ పునర్విభజన చట్టమే.

ఇక రెండు తెలుగు రాష్ట్రాలు నీటి పారుదల శాఖ సిబ్బందిని, వర్క్‌షాప్స్‌ను, వాహనాలను, నిధులను బోర్డులకు అప్పగించి చోద్యం చూస్తూ కూర్చోవాలి. ఏ ఒక్క ప్రాజెక్టునూ బోర్డులకు అప్పగించేది లేదని, గతంలో కేసీఆర్ తేల్చిచెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం రెండు నెలలైనా గడవకముందే ఈ రెండు ప్రాజెక్టులను, అన్ని ఔట్‌లెట్లను కేఆర్ఎంబీకి అప్పగిస్తున్నట్టు కేంద్ర జల్‌శక్తి శాఖ మినిట్స్ ద్వారా స్పష్టమైంది.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేలకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను, అన్ని ఔట్‌లెట్లను, కాల్వలను కేఆర్ఎంబీకి అప్పగిస్తే నికర జలాలపై ఆధారపడిన నాగార్జునసాగర్ ఎడమకాల్వకు మాత్రమే సాగర్ నిండిన సందర్భంగా నీటిని విడుదల చేస్తారు. వరద జలాలపై ఆధారపడి నిర్మించిన శ్రీశైలం ఎడమ కాల్వ (ఏఎంఆర్ ప్రాజెక్టు), కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, డిండి-విద్యాసాగర్ రావు తదితర ప్రాజెక్టులకు బోర్డు సాగు నీరు ఇవ్వదు.

శ్రీశైలం, నాగార్జునసాగర్ జల విద్యుత్తు ప్రాజెక్టులకు అవసరమైన నీటిని విడుదల చేయదు. టెయిల్ పాండ్ వద్ద రివర్స్ పంపింగ్ జరగదు. గత తొమ్మిదిన్నరేండ్లుగా కేఆర్ఎంబీ పనితీరును గమనించే వారికి బోర్డు ఆంధ్రాకు అనుకూలంగా, తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని స్పష్టమవుతుంది. ఆంధ్రాలో చంద్రబాబు లేదా వైఎస్ జగన్‌లలో ఎవరు అధికారంలో ఉన్నా మోదీ చెప్పుచేతల్లో ఉండటమే దీనికి ప్రధాన కారణం.

2015లో తప్పనిసరి పరిస్థితుల్లో కేవలం ఒక ఏడాది కోసమే 34:66 నిష్పత్తిలో కృష్ణా జలాల వినియోగానికి తెలంగాణ అంగీకరించినట్టు స్పష్టంగా రాసుకున్నారు. కృష్ణా జలాల్లో వాటా తేలేదాకా 50:50 నిష్పత్తిలో పంచాలని ఎంత మొత్తుకున్నా, వాకౌట్ చేసినా బోర్డు అంగీకరించలేదు. ఏటా పోతిరెడ్డిపాడు నుంచి వందలాది టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్నా బేసిన్‌కు, అక్రమ ప్రాజెక్టులకు మళ్లిస్తున్నా కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్ర వహిస్తున్నది. రాయలసీమ ఎత్తిపోతల అక్రమ ప్రాజెక్టుకు తొలి తట్ట మట్టి ఎత్తిన నాటినుంచి నేటిదాకా కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుకోలేదు.

> అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ ఫిర్యాదు చేసినా కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. కేఆర్ఎంబీకి ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలను సైతం బోర్డు పట్టించుకోలేదు. తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో రాయలసీమ ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించి, కొనసాగిస్తున్నా కేఆర్ఎంబీ వాటిని ఆపలేదు. ఇదీ కేఆర్ఎంబీ నిర్వాకం!

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీలో ఇద్దరు ఒక్కటైతే తెలంగాణ ప్రతినిధి పరిస్థితి అరణ్యరోదనే అవుతుంది. తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అత్యవసర పరిస్థితుల్లో కేఆర్ఎంబీకి విన్నవించి, బోర్డు మీటింగ్ పెట్టి మెజారిటీ నిర్ణయంతో నీళ్లు విడుదల చేయించుకోవడం సాధ్యమయ్యే పనేనా? శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా ఆంధ్రప్రదేశ్ చేతుల్లో ఉన్నది. నాగార్జునసాగర్ డ్యాం మాత్రం కేంద్ర రిజర్వ్ బలగాల స్వాధీనంలోకి రావడం వెనుక మోదీ-జగన్‌ల కుట్ర లేదా? ఈ పరిస్థితుల్లో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను అప్పగించడం వెనుక ఎలాంటి కుట్రలు దాగి ఉన్నాయో తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి.

*(వ్యాసకర్త: మాజీ చైర్మన్, తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ)*

> సామాజిక మథనం నుంచి పుట్టిన కళ సాహిత్యమని.. సాహిత్యం, కళలు సమాజానికి మార్గదర్శనం చేసే రెండు చేతులూ, కండ్లూ అని భావిస్తూ ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ప్రయాణం ప్రారంభమై అప్పుడే పదిహేనేండ్లు పూర్తయ్యాయి.

# పదిహేనేండ్ల ప్రరవే ప్రయాణం



అనిశెట్టి రజిత
98494 82462

సాహిత్య సృజన, రచన అంటే కేవలం వృత్తి, వ్యాపకం, గుర్తింపు, పేరుప్రఖ్యాతులు, కీర్తి కోసం ఎంచుకున్న మార్గమో, సాధనమో కాదని ప్రరవే నమ్ముతుంది. ఇటువంటి దృఢమైన అభిప్రాయంతో సాహిత్యకారులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు సంఘంలోని దౌర్జన్యాలు, అన్యాయాలు వెరసి అసమానతలపై కదం తొక్కే సైనికులైతే అది ప్రరవే సాహిత్య సాంస్కృతిక సామాజిక పథమే అవుతుంది.

సమాజంలో విస్మృతికి గురవుతున్న గుర్తింపు లేని వర్గాలకు, దళిత, బహుజన సామాజికవర్గాల రచయితలకు దామాషా ప్రాతిపదికన స్థానాలు ఏర్పరిచి, వారిలోని రచనా స్ఫూర్తిని, నిర్ణయాత్మక స్థాయిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ప్రరవే ఏర్పడింది. ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రణాళికాబద్ధంగా నిర్మితమైంది. అటువంటి సమ సాంప్రదాయాన్నే రాజీ లేకుండా పదిహేనేండ్లుగా కొనసాగిస్తూ వస్తున్నది. ఈ ప్రయాణంలో ప్రరవే అధ్యయనం, అవగాహన, ఆచరణ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఎంచుకొన్నవే. సామాజిక అంశాలపై ప్రరవే ఎన్నో సభలు, సమావేశాలను నిర్వహించింది. సాహిత్య సృజన విమర్శన రంగాలను, అనువాద రంగంలో, పత్రికా రంగంలో స్త్రీల కృషిని మదింపు చేయటమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం. దీంతో పాటు అనుకున్న లక్ష్యాలకు అవరోధంగా ఉన్న సామాజిక సాంస్కృతిక సమస్యలపై చర్చించటం, వాటిని అధిగమించటానికి చేయాల్సిన కృషి గురించి నిర్ధారణకు రావటం ఈ సభలు, సమావేశాల సారం. సామాజిక మార్పు కోసం ప్రపంచమంతటా జరిగిన ఉద్యమాలపై అవగాహన, సమకాలీన భారతీయ సమాజంలో జరుగుతున్న ఉద్యమాలతో సంబంధం కలిగి ఉండటమే సాహిత్య రచనను బాధ్యతాయుతమైన ఆచరణగా మలుస్తుందని ప్రరవే నమ్ముతుంది. అందుకే, ఆ దిశగా దేశీయ ఉద్యమాలు సాహిత్యాన్ని ప్రతిఫలించిన తీరుపైనా, సాహిత్య కళా సృజనకు బోల్షెవిక్ విప్లవం మూల వనరుగా మారిన తీరుపైనా ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించింది.

> యురేనియం, ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకాలు, ప్రజావ్యతిరేక ప్రభుత్వాల అభివృద్ధి విధానాలు సృష్టించిన విధ్వంసం, విస్థాపనల గురించి అవగాహన కోసం ప్రరవే క్షేత్ర పర్యటనలు కూడా చేపట్టింది. కొత్త పౌరసత్వ చట్టం, కొత్త రైతు చట్టాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రజా నిరసనలతోనూ ప్రరవే స్వరం కలిపింది. ప్రజాస్వామిక హక్కుల చైతన్యంతోనే ప్రరవే ఇవన్నీ చేసింది.

గుజరాత్ మారణకాండ పరిణామాలను సమీక్షిస్తూ బిల్కిస్ బానోకు మద్దతుగా అభిప్రాయ సమీకరణ జరిపినా, ముజఫర్‌నగర్‌కు వెళ్లి మత మారణకాండ బాధిత ప్రజలకు మద్దతుగా మాట్లాడినా.. హిందూత్వ అధికార రాజకీయాల వ్యతిరేకతలో భాగమే. సామాజిక సాహిత్య అధ్యయనాలకు ప్రేరకంగా ఉండాలనే ఆయా సదస్సులలో వక్తల ఉపన్యాసాలను, క్షేత్ర పర్యటన అనుభవాలను పుస్తకాల రూపంలో ప్రచురించింది ప్రరవే. ఢిల్లీ నుంచి మొదలుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాల మేధావులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు అందిస్తున్న స్నేహ సహకారాలు లేకుండా ఇవన్నీ సాధ్యమయ్యేవి కావు, మా పదిహేనేండ్ల ప్రయాణం ఇలా సాగేది కాదు.

పదిహేనేండ్ల ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని 2024, ఫిబ్రవరి 10, 11వ తేదీలలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తన ఏడో మహాసభను జరుపుకొంటున్నది. అందుకు ఖమ్మం వేదికగా నిలుస్తున్నది. సమకాలీన సమస్యగా మారిన 'ట్రోల్' ఈ మహాసభల ప్రధానాంశం. అదే అంశంపై మహిళల గొంతును వినిపించే కథనాలతో పుస్తకం కూడా ప్రచురిస్తున్నది ప్రరవే. ఈ మహాసభలకు ఖమ్మం సాహిత్య బంధుబృందాలను, రచయితలను, అభ్యుదయ భావాలు, ప్రజాస్వామిక ఆలోచనలు కల మిత్రులందరినీ ఆహ్వానిస్తున్నాం.

*(వ్యాసకర్త: ప్రరవే జాతీయ అధ్యక్షురాలు)*